dctelugu.com
# డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 09 శుక్రవారం, అక్టోబర్ 2026








కరీంనగర్ టౌన్ గోల్డ్, సిల్వర్ & జ్యువెల్లరీ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్
(రి.నెం. 2/2010)
తేది: 08/10/2026
సమయం : ఉ॥ 11-00 గంటలకు

| వస్తువు | తులం ధర | 10 గ్రా॥ ధర |
|---|---|---|
| బంగారం ధర 999 | 174140 | 149300 |
| వెండి ధర 999 | 2648 | 2270 |
| ఆర్నమెంట్ ధర (10%) తరుగు | | 138850 |

# కరీంనగర్ డంపింగ్ యార్డుకు శాశ్వత విముక్తి

- రూ.17 కోట్లతో త్వరలోనే బయో మైనింగ్ పనులు
- 52వ డివిజన్‌లో రూ.24 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్
- బతుకమ్మ, దసరా ఉత్సవాలకు 66 డివిజన్లలో ఘనంగా ఏర్పాట్లు



**కరీంనగర్ డీసీ :**
కరీంనగర్ నగరవాసులను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని 52వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ సరిల్ల రాజకుమారి ప్రసాద్‌తో కలిసి రూ.24 లక్షల సుడా నిధులతో చేపడుతున్న ఎస్‌డబ్ల్యూజీ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.అనంతరం డివిజన్ వ్యాప్తంగా పర్యటించి మురుగునీటి సమస్యలను స్వయంగా పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పను ల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.రూ.17 కోట్లతో బయో మైనింగ్ ప్రక్షాళనఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో 'స్వచ్ఛ భారత్ మిషన్' కింద డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి రూ.17 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ ముగిసి, ఈఎన్సీ అనుమతులు కూడా లభించాయని, త్వరలోనే బయో మైనింగ్ పనులను పట్టాలెక్కిస్తామని వెల్లడించారు.అంతేకాకుండా, యూసీఎఫ్ పథకం కింద రూ.80 కోట్లతో అత్యాధునిక చెత్త ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. 52వ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం యుఐడీఎఫ్ కింద ప్రత్యేకంగా రూ.1 కోటి నిధులు కేటాయించినట్లు చెప్పారు. పండుగలకు ముస్తాబవుతున్న నగరంరానున్న బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని మేయర్ చెప్పారు. నగరంలోని మొత్తం 66 డివిజన్లలో బతుకమ్మ ఆడే ప్రాంతాలతో పాటు నిమజ్జన ఘాట్ల వద్ద మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి నిధులు తీసుకువచ్చి కరీంనగర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ, సుందర నగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే
- గుమ్లాపూర్‌లో ఫారం పాండ్, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల పరిశీలన



**చొప్పదండి డీసీ :**
నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే సూచించారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో వీబీ జీ రామ్ జీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్ పనులతో పాటు గ్రామ పంచాయతీ భవనం వద్ద రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆమె స్వయంగా పరిశీలించారు.

**ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..**
వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఇంట్లో వినియోగించే నీరు రోడ్లపైకి వృథాగా పోకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలని, తద్వారా పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు పెరుగుతాయని వివరించారు. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగాల ఆనంద్, ఎంపీఓ రాజగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఏపీఓ రాజయ్య, టీఏ జగదీష్, ఎఫ్ఏ మహేష్, ఉప సర్పంచ్ రమణారెడ్డి, వార్డు సభ్యులు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

dctelugu.com
# డిస్ట్రిక్ కాలమ్
జిల్లాల వార్తావాహిని
e-PAPER

కరీంనగర్ | 09 శుక్రవారం, అక్టోబర్ 2026




# ఎస్‌జీఎఫ్ వెయిట్‌లిఫ్టింగ్‌లో 'డ్రీమ్' విద్యార్థుల భేష్

- 3 స్వర్ణాలు, 2 రజతాలతో మెరుపులు
- అండర్-19 విభాగంలో ప్రతిభ చాటిన కరీంనగర్ డ్రీమ్ కాలేజ్ క్రీడాకారులు
- విజేతలను ప్రత్యేకంగా అభినందించిన డైరెక్టర్ వెంకట్ రెడ్డి

**కరీంనగర్ డీసీ :**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక 'డ్రీమ్' జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బాలురు, బాలికల విభాగాల్లో హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో 3 స్వర్ణ (గోల్డ్), 2 రజత (సిల్వర్) పతకాలను కైవసం చేసుకున్నారు.
పతకాలు సాధించి కళాశాల కీర్తిని పెంచిన క్రీడాకారులను



కళాశాల డైరెక్టర్ అండ్ కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి గురువారం కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

**క్రీడల్లోనూ ప్రత్యేక ప్రోత్సాహం**

ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ సమాన ప్రాధాన్యత ఇస్తూ తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు అవసరమైన అత్యుత్తమ శిక్షణ, క్రీడా వసతులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల నిరంతర కృషి, క్రమశిక్షణ, గెలువాలనే పట్టుదలకు ఈ పతకాలే నిదర్శనమని కొనియాడారు.

**జాతీయ స్థాయిలో రాణించాలి**

భవిష్యత్తులో జరగబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ ఇదే ఊపును కొనసాగించి మరిన్ని పతకాలు సాధించాలని, కళాశాలతో పాటు కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలైన క్రీడాకారులతో పాటు వారిని విజేతలుగా తీర్చిదిద్దిన క్రీడా ఇన్‌చార్జ్ శ్రీకాంత్, అధ్యాపక బృందం, యాజమాన్య ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

# మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతాం: మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి**

**కరీంనగర్:**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయతకు, ప్రకృతిని ఆరాధించే విశిష్ట సంప్రదాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. నేటితరం విద్యార్థులకు మన పండుగలు, సాంస్కృతిక వైభవం యొక్క గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించే ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే మానేరు విద్యాసం స్థల ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం,



విద్యార్థిను లు సంప్రదాయ వస్త్రధారణలో, రంగురంగుల పూలతో అందం గా పేర్చిన బతుకమ్మలను మధ్య లో ఉంచి, జానపద గేయాలు మరియు బతుకమ్మ పాటలకు అనుగుణంగా చుట్టూ తిరుగు తూ ఉత్సాహంగా ఆడపాడారు. పాఠశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, కోలాటాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ వేడుకల్లో మానేరు విద్యా సంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డితో పాటు ప్రిన్సిపాళ్లు, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరాకు 2,425 ప్రత్యేక బస్సులు

- జేబీఎస్ - కరీంనగర్ మధ్య సేవలు..
- మహిళలకు 'మహాలక్ష్మి' పథకం వర్తింపు
- టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ మేనేజర్ బీ. రాజు

**కరీంనగర్ డీసీ**
బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు జేబీఎస్ (జూబ్లీ బస్టాండ్) - కరీంనగర్ మార్గంలో 2,425 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు కరీంనగర్ రీజియన్ మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 19 వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 1,175 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. పండుగ అనంతరం, తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం అక్టోబర్ 21 నుంచి 26 వరకు కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 1,250 ప్రత్యేక బస్సులను సర్వీసులో ఉంచుతారు.?ఈ ప్రత్యేక బస్సులలో కూడా మహిళలకు 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం వర్తిస్తుందని రీజినల్ మేనేజర్ స్పష్టం చేశారు. ప్రయాణికులు ముందస్తు టికెట్ రిజర్వేషన్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను సందర్శించి, ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.